సాక్షి
గుంటూరు
సోమవారం, 17, జూన్, 2024



వీనుల విందుగా సంగీత కచేరి

నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం శ్రీ త్యాగ రాజస్వామి కళా వేదికపై ఆదివారం సాయంత్రం దేశిరాజు స్నిగ్ధ (చెన్నై) సంగీత కచేరి వీనుల విందుగా జరిగింది.



అంకమ్మ తల్లికి పూజలు

బాపట్ల: స్థానిక శీలం వారి వీధిలో వేంచేసియున్న అంకమ్మ తల్లి గ్రామ కొలుపుల్లో భాగంగా ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రభతో ఊరేగింపు నిర్వహించారు.

సకల ఐశ్వర్య ప్రదాయనిగా బండ్లమ్మ



చందోలు(పిట్ట లవానిపాలెం): మండలంలోని చందోలులో వేంచేసిఉన్న శ్రీ బగళాముఖి బండ్లమ్మ దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని సకల ఐశ్వర్య ప్రదాయనిగా అలంకరించారు.

న్యూస్‌రీల్

హోరాహోరీగా రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు



పిట్టలవానిపాలెం: మండలంలోని ఖాజీపాలెం డిగ్రీ కళాశాలలో 10వ రాష్ట్రస్థాయి రగ్బీ క్రీడా పోటీల్ని ఆదివారం నిర్వహించారు. హోరాహోరీగా జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల పరిధిలోని 300 మంది స్త్రీ, పురుషులు పాల్గొన్నారు. రగ్బీ క్రీడల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బి.రామాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో జరిగిన ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన క్రీడాకారుల్ని ఎంపిక చేసి ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున పుణెలో జరిగే పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. పురుషుల నుంచి 12 మందిని, స్త్రీల నుంచి 12 మందిని ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా రగ్బీ అసోసియేషన్ చైర్మన్ చీరాల నాగలక్ష్మి, కళాశాల పీడీ రామకృష్ణారెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

కార్తికేయుని దర్శించుకున్న ఎండోమెంట్ చీఫ్ సెక్రెటరీ



మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఆంధ్రప్రదేశ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ(రెవెన్యూ, ఎండోమెంట్) ఆర్.కరికల్ వలవెన్ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న ఆయన తొలుత ప్రదక్షిణ చేసిన అనంతరం నాగపుట్టలో పాలు పోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు బుద్దు సతీష్‌శర్మ, వెంకటేశ్వరరావు స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ వేద పండితులు నౌడూరి సుబ్రహ్మణ్య శర్మ, బాలకృష్ణ శర్మ వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఏసీ ఎస్.ఎస్. చక్రధరరావు స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాలు అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాగర్ నీటి మట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 504.50 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 812.10 అడుగుల వద్ద ఉంది.

సుబ్బారాయుడి సన్నిధిలో భక్తుల రద్దీ



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఆదివారం కోలాహలంగా మారింది. ఉదయం నుంచే తెలుగు ఉభయ రాష్ట్రాలతో పాటు పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం నిండిపోయింది. ఎటుచూసినా క్యూలైన్లన్నీ నిండిపోయాయి. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో సూపరింటిండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని ధర్మపథం కళావేదికపై ఆదివారం తెనాలికి చెందిన శ్రీలక్ష్మీ కూచిపూడి నృత్య కళా కేంద్రానికి చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై ఎ.వెంకటలక్ష్మి శిష్య బృందం పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చింది. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు కళావేదిక వద్దకు చేరుకుని నృత్య ప్రదర్శనను ఆద్యంతం ఎంతో ఆసక్తితో వీక్షించారు. అనంతరం కళా బృందానికి చెందిన వారికి అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు.

విత్తన విక్రయాలపై కన్ను

- సీజన్ ప్రారంభంలోనే దాడులు ప్రారంభించిన విజిలెన్స్
- కాలం చెల్లిన మిర్చి విత్తనాలు స్వాధీనం
- రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచడమే లక్ష్యం
- ఏడాది కాలంలో రూ. 10 కోట్ల విలువైన విత్తనాలు, బయో కెమికల్స్ స్వాధీనం



దుకాణాల్లో విత్తనాలను పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి, ప్రతినిధి, గుంటూరు: ఉమ్మడి గుంటూరు జిల్లాలో నాణ్యత లేని, గడువు తీరిన విత్తనాల విక్రయాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ డేగకన్ను వేసింది. ఈ ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందు నుంచే విత్తన షాపులపై దాడులు మొదలు పెట్టింది. ముఖ్యంగా పత్తి, మిరప విత్తనాల విషయంలో జరుగుతున్న అక్రమాలపై దృష్టి పెట్టింది. అనుమతులు లేకుండా, అక్రమంగా నిల్వ చేయడం, నకిలీ విత్తనాలను రైతులకు అంటగట్టే ప్రయత్నాలు జరుగుతుండటంతో రైతులు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

కృత్రిమ కొరతకు చెక్..

గత నెలలో గుంటూరు నగరంలోని విత్తన షాపుల్లో దాడి చేయగా అధిక డిమాండ్ ఉన్న పత్తి, మిర్చి విత్తనాలను అక్రమంగా నిల్వ చేసి, కృత్రిమ కొరత సృష్టించి అధిక రేట్లకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఒక షాపులో రిజిస్టర్‌లో స్టాక్ లేనట్లు చూపి ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు గుర్తించి 6ఏ కేసు నమోదు చేశారు. కొన్ని షాపుల్లో సోర్స్ సర్టిఫికెట్ లేకుండా అమ్ముతుండటం గమనించి సీడ్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేశారు. ఏటుకూరు రోడ్డులో ఉన్న విత్తనాల షాపులో తనిఖీ చేసినప్పుడు 8.70 కిలోల కల్తీ మిర్చి విత్తనాలు అమ్మడానికి ప్యాకింగ్ చేయడానికి సిద్ధంగా ఉండగా పట్టుకున్నారు. బెంగళూరు నుంచి కిలో రూ.20 వేలకు తీసుకువచ్చి ఆకర్షణీయమైన ప్యాకింగ్ చేసి కిలో రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకూ అమ్ముతున్నట్లు గుర్తించారు.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా..

దాచేపల్లిలో కూడా వ్యవసాయ శాఖ అనుమతులు లేకుండా విత్తనాల విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తించారు. ఇక్కడ పెద్ద ఎత్తున పత్తి విత్తనాల విక్రయాలు జరుగుతున్నాయి. ఒక్కషాపులోనే 240 ప్యాకెట్ల విత్తనాలను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు రాజాగారితోటలోని విత్తన షాపుల్లో కాలం చెల్లిన హైబ్రీడ్ మిర్చి, కూరగాయల విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. బాపట్ల జిల్లా ఇంకొల్లులో అనుమతులు లేకుండా, రికార్డుల్లో నమోదు చేయకుండా పెద్దఎత్తున మిర్చి విత్తనాలు అమ్ముతుండగా పట్టుకున్నారు.

నిబంధనలు మీరితే కేసులే..

గత ఏడాది కాలంలో జిల్లాలో మొత్తం 82 కేసులు పెట్టి రూ.10.48 కోట్ల విలువైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, బయో–ప్రొడక్ట్స్ పట్టుకున్నారు. సుమారు రూ.25.21 లక్షల విలువైన 1999 కిలోల విత్తనాలను స్వాధీనం చేసుకుని 19 కేసులు నమోదు చేశారు. సుమారు రూ.39.45 లక్షల విలువైన పురుగు మందులు స్వాధీనం చేసుకుని 23 కేసులు నమోదు చేశారు. సుమారు రూ.6.95 కోట్ల రూపాయల విలువైన ఎరువులు స్వాధీనం చేసుకుని 25 కేసులు నమోదు చేయగా, రూ.2.88 కోట్ల విలువైన బయో–ప్రొడక్టులను స్వాధీనం చేసుకుని 20 కేసులు నమోదు చేశారు.

అనుమతులు లేకుండా అమ్మితే చర్యలు


ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో ఎవరైనా అనుమతులు లేకుండా, నకిలీ విత్తనాలు అమ్ముతుంటే కఠిన చర్యలు తప్పవు. కొన్నిచోట్ల కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు అమ్ముతున్నట్లు మా దృష్టికి వచ్చింది. వారిపై కూడా చర్యలు తీసుకుంటున్నాం. రైతులకు నష్టం వచ్చేలా వ్యాపారులు ప్రయత్నిస్తే కేసులు తప్పవు.

– కె.ఈశ్వరరావు, జిల్లా విజిలెన్స్ ఎస్పీ

సుందరం.. స్ఫూర్తిదాయకం

సుందరం భావన్నారాయణ జీవితం ఆదర్శనీయం

- 57 ఏళ్ల వయస్సులో 27 పీజీలు పూర్తి
- ఐదు భాషల్లో ప్రవచనాలు
- 85 సార్లు రక్తదానం
- లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ దిశగా పయనం



పుస్తక పఠనంలో భావన్నారాయణ

గుంటూరు వెస్ట్: అవసరం, పట్టుదల మనుషుల్ని ఎంతవరకైనా తీసుకెళ్తుంది. అది మంచికైనా చెడుకైనా ఆయా వ్యక్తులు ఎంచుకున్న మార్గాన్ని బట్టి వారి భవిష్యత్తును నిర్ణయిస్తుంది. పేదరికంలోనూ పట్టు వదలని విక్రమార్కుడిలా ఒక వ్యక్తి చేసిన భగీరథ ప్రయత్నం ఉన్నత విద్యావంతుడిగా తీర్చి దిద్దింది. ఎందరికో మార్గదర్శకమయ్యింది. స్థానిక కృష్ణ నగర్‌కు చెందిన మయ్యూర్ సుందరం భావన్నారాయణ విజయ ప్రస్థానం ఆద్యంతం ఆసక్తికరం.. స్ఫూర్తిదాయకం. 57 ఏళ్ల వయస్సులోనూ ఎంఏ (ఆంగ్లం) ఎంఏ (ఆస్ట్రాలజీ), ఎంఏ (ఫిలాసఫీ), ఎంఏ (సైన్సెస్) ఇలా 27 పీజీలు దేశంలోని పేరొందిన విశ్వవిద్యాలయాల నుంచి సాధించారు. దీంతోపాటు ఆంగ్లం, హిందీ, సంస్కృతం, తమిళం, తెలుగు భాషల్లో అద్భుత ప్రావీణ్యం సంపాదించడంతోపాటు ప్రవచనాలు చేస్తున్నారు. ఇప్పటివరకు 85 సార్లు రక్తదానం చేశారు.

కడు బీదరికం నుంచి..

భావన్నారాయణ స్వస్థలం పొన్నూరు. తండ్రి సుందరం వంట పనిచేస్తుంటారు. ఇప్పటిలా కాదు కదా పాత రోజుల్లో పనులు చాలా తక్కువగా ఉండేవి. సుందరానికి అప్పటికే నలుగురు సంతానం. వంట పనిఉంటేనే ఇంట్లో పొయ్యి వెలిగేది. లేకపోతే పస్తే అనే పరిస్థితుల నేపథ్యంలో కనీసం తన బిడ్డలకైనా ఆహారం దొరుకుతుందని సుందరాన్ని తిరుపతిలోని వేద పాఠశాలలో చేర్పించారు. వేదం సంగతి ఎలా ఉన్నా ముందుగా సుందరానికి వసతి, ఆహారం దొరికేసరికి కొంత ఉపసమనం కలిగింది. దీంతోపాటు వేద విద్యను అకుంఠిత దీక్షతో పదేళ్లు అభ్యసించారు. వేదాలమీద పట్టుతోపాటు జీవితంపై ఆశలు చిగురించాయి. అంతేకాదు తన దారిద్ర్యాన్ని జయించాలంటే విద్య అనే ఆయుధం తనతో ఎప్పుడూ ఉండాలని గుర్తించారు. అక్కడి నుంచి చెన్నైలోని మేనమామ వరదరాజన్ ఇంటికి చేరారు. అక్కడ చిన్న చిన్న పనులు చేసుకుంటూ విద్యను కొనసాగించారు. డిగ్రీతోపాటు పీజీలు కూడా చేయడంతో ఉపాధ్యాయ వృత్తిని చేపట్టారు.

ఐదు భాషల్లో ప్రవచనాలు..

భావన్నారాయణకు భార్య సాయికుమారి రూపంలో చక్కని సహధర్మచారిణి లభించింది. వీరికి ముగ్గురు సంతానం. వారంతా స్థిరపడ్డారు. భార్య ప్రోత్సాహంతో ఆయన ఒక పక్క విద్యను కొనసాగిస్తూ మరో పక్క ఆంగ్లం, హిందీ, సంస్కృతం, తమిళం, తెలుగు భాషల్లో ప్రవచనాలు చెబుతున్నారు. ఇప్పటివరకు 1008 యూట్యూబ్ వీడియోలు చేసారు. దీంతోపాటు తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహిస్తున్న ఆళ్వార్ దివ్య ప్రభంద ప్రాజెక్ట్‌లో ఉపన్యాసాలు చేస్తున్నారు.

చివరి శ్వాస వరకు చదువు కొనసాగిస్తా..

నా చివరి శ్వాస ఉన్నంతవరకు చదువును కొనసాగిస్తూనే ఉంటాను. ఇప్పటి వరకు 27 పీజీలు పూర్తి చేశాను. వచ్చే నెలలో లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు దరఖాస్తు చేస్తున్నాను. ప్రతి మూడు నెలలకు ఒక సారి రక్తదానం చేస్తుంటాను. ఇప్పటివరకు 85 సార్లు చేశాను. నా చివరి శ్వాస ఉన్నంత వరకు నాకు చేతనైన సాయం చేస్తాను. నేటి విద్యార్థులు సబ్జెక్ట్‌లో మార్కుల కోసం మాత్రమే కాకుండా అందులోని జ్ఞానాన్ని సముపార్జించేందుకు ప్రయత్నించాలి. చక్కని నడవడిక కూడా మనల్ని మరింత ఉన్నతులుగా తీర్చిదిద్దుతుంది.

– మయ్యూర్ సుందరం భావన్నారాయణ

కిక్కిరిసిన విశ్వాస శిఖరం

గుణదల (విజయవాడతూర్పు): క్రైస్తవ ఆధ్యాత్మిక శిఖరం గుణదల మేరిమాత పుణ్యక్షేత్రం భక్తులతో పోటెత్తింది. ఆదివారం సెలవు దినం కావడంతో అనేక ప్రాంతాల నుంచి యాత్రికులు వేలాదిగా గుణదల కొండకు తరలి వచ్చారు. విద్యార్థులకు సెలవులు ముగిసి పాఠశాలలు ప్రారంభమవుతున్న ప్రస్తుత తరుణంలో చిన్నాపెద్ద అంతా మరియతల్లిని దర్శించుకున్నారు. తమ చిన్నారుల చదువులు సక్రమంగా సాగాలంటూ వేడుకున్నారు.



ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ట్రావెల్ బస్సు

- కంటెపూడి వద్ద ప్రమాదం
- క్లీనర్ మృతి, మరో తొమ్మిది మందికి గాయాలు
- బస్సు డ్రైవర్ రమేష్‌బాబును అదుపులోకి తీసుకున్న పోలీసులు



తిమ్మిశెట్టి మణికంఠ (ఫైల్)



ప్రమాదంలో నుజ్జునుజ్జైన బస్సు ముందు భాగం

సత్తెనపల్లి: రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ట్రావెల్స్ బస్సు ఢీ కొట్టిన సంఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం కంటెపూడి వద్ద ఆదివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. బాపట్ల నుంచి హైదరాబాద్‌కు 30 మంది ప్రయాణికులతో మార్నింగ్ స్టార్ ట్రావెల్స్ బస్సు ఉదయం బయలు దేరింది. కంటెపూడి సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వేగంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు క్లీనర్‌గా పనిచేస్తున్న నరసరావుపేట మండలం కాకాని గ్రామానికి చెందిన తిమ్మిశెట్టి మణికంఠ (24)కు తీవ్ర గాయాలయ్యాయి. వైద్యశాలకు తరలించే క్రమంలో మార్గంమధ్యలో మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మరో తొమ్మిది మందికి గాయాలయ్యాయి. వారిలో బాపట్లకు చెందిన కె.లక్ష్మీ సుధ, కె.లక్ష్మి, కె.చంద్రశేఖర్, ప్రత్తిపాడుకు చెందిన వై. ప్రసాదరెడ్డి, గార్లపాడుకు చెందిన రత్తయ్య, పెదనందిపాడుకు చెందిన మాధవి ఉన్నారు. మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించగా ప్రాథమిక చికిత్స చేయించుకుని వెళ్లారు. మృతుడి తల్లి తిమ్మిశెట్టి నాగమణి ఫిర్యాదు మేరకు సత్తెనపల్లి రూరల్ ఏఎస్ఐ కరీముల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనకు కారకుడైన బస్సు డ్రైవర్ ఈదర రమేష్‌బాబును సత్తెనపల్లి రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బస్సు ప్రమాదానికి గురి కావడంతో అందులోకి ప్రయాణికులు ఆందోళన చెందారు. సురక్షితంగా బయట పడటంతో ఊపిరి పీల్చుకున్నారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా కొందరు హైదరాబాద్ వెళ్లగా, మరి కొందరు ప్రయాణాన్ని వాయిదా వేసుకొని వెనక్కి వెళ్లారు.

‘ఆణిముత్యాలు’ అమలయ్యేనా?

- గతేడాది టెన్త్ టాపర్లకు రూ.లక్ష నగదు బహుమతి
- జిల్లా, నియోజకవర్గ స్థాయి విజేతలకు కూడా ప్రోత్సాహకాలు
- ఈ ఏడాది ఇంత వరకూ అందని మార్గదర్శకాలు



గత ఏడాది టాపర్లకు నగదు, సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న అప్పటి మంత్రి అంబటి రాంబాబు (ఫైల్)

సత్తెనపల్లి: ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్టం చేయడం ... ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభావంతుల్ని ప్రోత్సహించి మిగిలిన విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేందుకు గత ప్రభుత్వం పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన వారికి ‘ఆణిముత్యాలు’ పేరిట నగదు ప్రోత్సాహకాలు అందించింది. ఈ పథకాన్ని ఏటా అమలు చేయనున్నట్లు స్పష్టం చేసింది. దీంతో 2023–24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించారు. నగదు ప్రోత్సాహకాలు అందుతాయని భావించారు. పదో తరగతి విద్యార్థులకు మాత్రమే కాకుండా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రతి గ్రూపులో టాపర్లను ఎంపిక చేసి ప్రోత్సాహకాలు అందించారు. ఆణిముత్యాలుగా ఎంపికైన విద్యార్థులు చదువుతున్న పాఠశాలల్లో ఉపాధ్యాయుల్ని, నగదు పురస్కారం అందుకున్న విద్యార్థుల తల్లిదండ్రుల్ని కూడా గత ప్రభుత్వం ఘనంగా సత్కరించి గౌరవించింది.

టాపర్లకు రూ. లక్ష బహుమతి

ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ వివిధ గ్రూపులు చదివిన విద్యార్థుల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారిని ఎంపిక చేసి టాపర్లకు రూ. లక్ష నగదు ప్రోత్సాహాన్ని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి స్వయంగా అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ. 75 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ. 50 వేలు అందజేశారు. నగదు పురస్కారంతో పాటు సర్టిఫికెట్, మెడల్స్ కూడా ఇచ్చి విద్యార్థుల్ని ప్రోత్సహించారు.

జిల్లా, నియోజకవర్గాల స్థాయిలో ప్రోత్సాహకాలు

నగదు ప్రోత్సాహకాలు కేవలం రాష్ట్రస్థాయికే పరిమితం చేయకుండా నియోజకవర్గ, జిల్లా స్థాయికి వర్తింప చేశారు. నియోజకవర్గ స్థాయి టాపర్లకు రూ.15 వేలు, ద్వితీయ స్థానంలో రూ. 10 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ. 5 వేలు అందజేశారు. జిల్లా స్థాయిలో టాపర్లకు రూ. 50 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ. 30 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.15 వేలు అందించారు. ఈ రెండు స్థాయిల్లో కూడా ఇంటర్ విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించారు. జగనన్న స్ఫూర్తితో కొన్ని ప్రాంతాల్లో స్థానిక దాతల సహకారంతో పాఠశాల స్థాయిలో టాపర్లకు నగదు పురస్కారం అందజేశారు. పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానానికి రూ. 3 వేలు, ద్వితీయ స్థానానికి రూ. 2 వేలు, తృతీయ స్థానానికి రూ. 1000 నగదు బహుమతులను అందజేశారు.

ఈ ఏడాది సందిగ్ధం

ఆణిముత్యాలు పథకానికి గత ఏడాది తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నుంచి గొప్ప స్పందన లభించింది. గతంలో ఏ ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమం చేపట్టలేదని, భవిష్యత్‌లో కూడా కొనసాగించాలని కోరారు. గత ఏడాది జూన్ 20 నాటికి అన్ని స్థాయిల్లో నగదు ప్రోత్సాహకాలు అందించే కార్యక్రమాలు పూర్తి చేశారు. అయితే, ఈ ఏడాది నగదు పురస్కారాలు అందుతాయా.. లేదా ? అనేది ప్రశ్నార్థకంగా మారింది. దీనిపై విద్యాశాఖ రాష్ట్ర కార్యాలయం నుంచి కూడా ప్రకటన వెలువడలేదు. జిల్లా విద్యాశాఖ అధికారులకు కూడా మార్గదర్శకాలు అందకపోవడంతో ఈ ఏడాది నగదు ప్రోత్సాహకాలు ఇస్తారా? లేదా? అనే సందేహం సర్వత్రా వ్యక్తమవుతోంది.

ప్రశాంతంగా యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్



విజయవాడ ఎస్ఆర్ఆర్ కళాశాలలో విద్యార్థులను తనిఖీ చేసి లోపలికి పంపుతున్న పోలీసులు

- 50 శాతం దాటని అభ్యర్థుల హాజరు
- పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లాలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఆధ్వర్యంలో నిర్వహించిన సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా వివిధ కేంద్రాల్లో పరీక్ష రాసేందుకు మొత్తం 11,112 మంది అభ్యర్థులను కేటాయించారు. వారు పరీక్షలు రాసేందుకు వీలుగా విజయవాడలో 25 పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. పరీక్షకు గంటన్నర ముందుకు అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. ఉదయం తొమ్మిది గంటల వరకూ, మధ్యాహ్నం రెండు గంటల వరకూ అభ్యర్థులను కేంద్రంలోనికి అనుమతించారు. అడ్మిట్‌కార్డు, గుర్తింపు కార్డు కలిగిన వారిని మాత్రమే అనుమతించారు. అదే విధంగా పోలీసు శాఖ అభ్యర్థుల నుంచి ఫోన్, బ్యాగులు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు లేకుండా తనిఖీ చేసి లోపలకు అనుమతించారు. ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకూ, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ రెండు పూటల పరీక్ష కొనసాగింది. ఉదయం జరిగిన పేపర్–1కు 5469 మంది (49.22శాతం), మధ్యాహ్నం పేపర్–2కు 5431 (48.88 శాతం) అభ్యర్థులు హాజరయ్యారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన..

నగరంలో జరుగుతున్న సివిల్స్ (ప్రిలిమ్స్) పరీక్షను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు ఆదివారం పరిశీలించారు. నగరంలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాల, బిషప్ అజరయ్య జూనియర్ కళాశాలల్లో జరుగుతున్న పరీక్ష తీరును పరిశీలించి అధికారులను అభినందించారు.

దారులన్నీ దుర్గమ్మ సన్నిధికే!

- ఆదివారం రికార్డు స్థాయిలో భక్తుల రాక
- సర్వ దర్శనానికి మూడు గంటలు
- కొండ దిగువున పలు మార్లు ట్రాఫిక్‌కు అంతరాయం



కిక్కిరిసిన క్యూలైన్లు



దుర్గమ్మ దర్శనానికి వేచియున్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్నాటకల నుంచి తరలివచ్చిన భక్తులు, యాత్రికులతో ఆధ్యాత్మిక కేంద్రమైన ఇంద్రకీలాద్రిపై సందడి వాతావరణం నెలకొంది. ఆదివారం తెల్లవారుజామున 6 గంటలకు ప్రారంభమైన భక్తుల రద్దీ సాయంత్రం 4 గంటల వరకు ఏకతీరున కనిపించింది. ఇతర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తుల వాహనాలతో హెడ్ వాటర్ వర్క్స్, సీతమ్మ వారి పాదాలు, వీఎంసీ కార్యాలయం, రాజీవ్‌గాంధీ పార్కు పరిసరాలు కిటకిటలాడాయి. భక్తుల వాహనాలతో దుర్గగుడి పరిసరాలలో పలు మార్లు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రద్దీ నేపథ్యంలో సర్వ దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. రద్దీని నియంత్రించేందుకు, వారికి అమ్మవారి దర్శనంలో ఎటువంటి ఇబ్బందీ కలుగకుండా ఉండేలా ఆలయ ఈవో కేఎస్ రామరావు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కొండపైకి కార్లు రాకపోకలను నిలిపివేయడంతో పాటు దసరా, భవానీ దీక్షల విరమణ సమయంలో అనుసరించే కంపార్టుమెంట్ విధానాన్ని క్యూలైన్‌లో అమలు చేశారు. ఆదివారం ఒక్క రోజే సుమారు 60 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు.

కిటకిటలాడిన క్యూలైన్లు

ఉదయం 6 గంటల నుంచి ప్రారంభమైన భక్తుల రద్దీ క్రమక్రమంగా పెరుగుతూ వచ్చింది. ఉదయం 9 గంటల కల్లా ఆలయ ప్రాంగణంలోని క్యూలైన్లు భక్తులతో నిండిపోగా, అటు ఓం టర్నింగ్, ఇటు మహా మండపం ఆరో అంతస్తు వరకు క్యూలైన్ల రద్దీ కనిపించింది. దీంతో ఆలయ అధికారులు అప్రమత్తమై ఆలయంలోని వివిధ విభాగాల్లో పని చేసే అధికారులు, సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించారు. మధ్యాహ్నం మహా నివేదన నిమిత్తం అరగంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేయడంతో ఆలయ ప్రాంగణంలో ఎక్కడ చూసినా భక్తులే కనిపించారు. దీంతో వీఐపీ, అంతరాలయ దర్శనానికి టికెట్లు తప్పనిసరి చేసిన అధికారులు, రద్దీకి అనుగుణంగా ముఖ మండప దర్శనానికి అనుమతించారు. దీంతో రూ. 300 క్యూలైన్‌లో గంటల తరబడి వేచి ఉన్న భక్తులకు కాసింత ఉపశమనం కలిగింది. మరో వైపున ఆదివారం కావడంతో అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సూర్యోపాసన సేవతో పాటు పలు ఆర్జిత సేవలను నిర్వహించగా పెద్ద ఎత్తున ఉభయదాతలు సేవలో పాల్గొన్నారు. రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్యాశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.

క్లుప్తంగా

బక్రీద్ పండుగ శుభాకాంక్షలు

బాపట్ల జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: బక్రీద్ పండుగ సందర్భంగా బాపట్ల జిల్లా ప్రజలకు కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదివారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ పర్వదినాన్ని ఆనందంగా జరుపుకోవాలని, ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలు, సోదర భావంతో మెలగాలని పేర్కొన్నారు. పాడి పంటలతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని తెలిపారు.

ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు

బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల టౌన్: త్యాగాలకు ప్రతీక అయిన ఈద్ అల్ అదా సందర్భంగా ముస్లిం సోదరులకు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం పండగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని ఈద్గాలు, మసీదుల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పగడ్బందీ చర్యలు తీసుకున్నామన్నారు. సోషల్ మీడియాపై నిఘా ఉంచామని, ఆకతాయి చేష్టలతో వదంతులను ఉద్దేశపూర్వకంగా సృష్టిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు.

నేడు ఎయిర్‌పోర్ట్‌కు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి

గన్నవరం: కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు సోమవారం ఉదయం 7 గంటలకు గన్నవరం విమానాశ్రయాన్ని సందర్శించనున్నట్లు ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ ఎల్.లక్ష్మీకాంత్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయన తొలిసారిగా ఎయిర్‌పోర్ట్‌కు విచ్చేస్తున్నారని పేర్కొన్నారు. విమానాశ్రయ అభివృద్ధి, నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ తదితర అంశాలపై సమీక్షించనున్నట్లు తెలిపారు.

చాంబర్ అధ్యక్ష పదవికి కొత్తూరి రాజీనామా

నరసరావుపేట: చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్ష పదవికి రాజీనామా చేసినట్లు అధ్యక్షుడు కొత్తూరి కిషోర్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పౌడా చైర్మన్ మిట్టపల్లి రమేష్ సహకారంతో 2019 ఆగస్టు నుంచి బాధ్యతలు నిర్వర్తిస్తున్నట్లు చెప్పారు. కరోనా లాక్‌డౌన్ సమయంలో ప్రజలు, వ్యాపారస్తులకు నిత్యావసరాలు, మాస్కులు, శానిటైజర్లు ఉచితంగా చాంబర్ తరఫున పంపిణీచేసి విశేష సేవలు అందించినట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు తనకు సహకరించిన అధికారులు, వ్యాపారస్తులు, ఛాంబర్ కమిటీ సభ్యులు, అసోసియేషన్ ప్రెసిడెంట్లు, సెక్రటరీలకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

అరచేతిలో వాతావరణం

- యాప్‌లతో రైతులను అప్రమత్తం చేస్తున్న వాతావరణ శాఖ
- రైతులకు ఎంతో ప్రయోజనం
- ఎప్పటికప్పుడు వర్షం, పిడుగుల సమాచారం



కొరిటెపాడు(గుంటూరు): గతంలో వాతావరణ సమాచారం రైతులకు అందుబాటులో లేకపోవడంతో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై ఆధారపడ్డ లక్షలాది మంది తీవ్రంగా నష్టపోయేవారు. నారుమడులు వేసిన నాటినుంచి పంట చేతికి వచ్చే వరకు వర్షాలతో రైతన్నకు ఇబ్బందులు తప్పేవి కావు. వర్షాలు, ఈదురు గాలుల తీవ్రతకు పంటకు తీవ్రనష్టం ఏర్పడేది. పిడుగుల వల్ల రైతులు, వ్యవసాయ కూలీలు, పశువుల కాపరులు ప్రాణాలు కోల్పోయేవారు. పిడుగుపడే అవకాశం ముందుగా తెలుసుకునే అవకాశం లేక పోవడంతో ప్రాణ, ఆస్తి నష్టం ఎక్కువగా జరిగేది. భారీవర్షాలతో పంట చేలు దెబ్బతినేవి. ఇలాంటి పరిస్థితికి భారత వాతావరణ విభాగం(ఐఎండీ) తెరదించింది. గ్రామ పంచాయతీ స్థాయిలోనే వాతావరణం అంచనాలు విడుదల చేస్తోంది. చేతిలో స్మార్ట్‌ఫోన్, ఇంటర్నెట్ సౌకర్యం ఉంటే వాతావరణం వివరాలు తెలుసుకుని అప్రమత్తమయ్యే వీలు ఏర్పడింది.

'మేఘదూత్'తో అప్రమత్తం..

విత్తనం వేయడం దగ్గర నుంచి ఎరువులు వేసే సమయం, పంట మసూళ్ల సమయంలో వర్షం వల్ల రైతుకు నష్టం వాటిల్లేది. ఇలాంటి నష్టాల నుంచి బయటపడేందుకు 'మేఘదూత్' యాప్ రూపుదిద్దుకుంది. 'మేఘదూత్' సాయంతో వారం రోజులు ముందుగానే నాలుగైదు రోజుల వాతావరణ మార్పులు, వర్ష సూచన, ఉష్ణోగ్రత వివరాలను తెలుసుకునే అవకాశం ఉంది. ఈ యాప్ ద్వారా ప్రతి మంగళ, శుక్రవారాల్లో వాతావరణ సమాచారంతో అగ్రోమెట్ ఫీల్డ్ యూనిట్లు(ఏఎంఎఫ్‌యూ) రైతులకు మెసేజ్ పంపుతున్నాయి.

పిడుగు సమాచారం కోసం వజ్రపాత్..

గూగుల్ ప్లే స్టోర్ నుంచి వజ్రపాత్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్ గుర్తుపై నొక్కితే రెండు రకాల సమాచారం వస్తుంది. ఎడమ వైపు పిడుగు గుర్తు, పిడుగు సమాచారం కనిపిస్తుంది. అక్కడ నొక్కితే మనమున్న ప్రాంతం సహా మ్యాప్ కనిపిస్తుంది. రెడ్, ఆరెంజ్, ఎల్లో కలర్స్ వలయాలు కనిపిస్తాయి. వీటి పక్కనే 8, 15, 30 అంకెలుంటాయి. ఈ అంకెల ప్రకారం అంటే కొద్దిసేపట్లో ఎంత దూరంలో పిడుగుపడే అవకాశముందో చూపిస్తుంది. దీంతో రైతులు, ప్రజలు అప్రమత్తమయ్యే అవకాశం ఉంటుంది.

రెయిన్ అలారం..

గూగుల్ ప్లేస్టోర్ నుంచి రెయిన్ అలారం యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వినియోగదారుడికి అందిన సమాచారం మేరకు అతను ఉండే ప్రాంతానికి సమీపంలోని 20 కిలోమీటర్ల పరిధిలో ఎక్కడ వర్షం పడే అవకాశముందో తెలుసుకోవచ్చు. వర్షం ముప్పును ముందుగా గుర్తించి తగిన చర్యలు తీసుకునేందుకు వీలుంటుంది.

యాప్‌తో ఎన్నో ప్రయోజనాలు..

వెదర్ యాప్ అందుబాటులోకి రావడంతో ముఖ్యంగా రైతులకు అనేక ప్రయోజనాలున్నాయి. ఎప్పటికప్పుడు వాతావరణ సమాచారాన్ని తెలుసుకునే వీలుంటుంది. రైతులకు వర్ష సూచన తెలియకపోవడంతో విత్తనాలు, ఎరువులు వేసుకోవడం.. పురుగు మందుల పిచికారీ చేసిన వెంటనే వర్షం రావడం వల్ల నష్టపోతున్నారు. వెదర్ యాప్‌తో వర్ష సూచనలు తెలుసుకోవడం ద్వారా అప్రమత్తమయ్యే అకాశాలు ఉంటాయి.

– నున్నా వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి, గుంటూరు

స్కేటింగ్‌లో జెస్సీ జైత్రయాత్ర

న్యూజిల్యాండ్‌లో జరిగిన ఓషియానిక్ స్కేటింగ్ పోటీల్లో విజయవాడ క్రీడాకారిణికి గోల్డ్



ప్రపంచ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో ప్రథమ స్థానం సాధించిన జెస్సీ రాజ్

విజయవాడస్పోర్ట్స్: ప్రపంచ క్రీడా వేదికపై విజయవాడ క్రీడాకారిణి మాత్రపు జెస్సీ రాజ్ సత్తా చాటింది. న్యూజిల్యాండ్‌లో రెండు రోజుల పాటు జరిగిన ప్రపంచ ఓషియానిక్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌నకు భారత్ నుంచి ప్రాతినిధ్యం వహించి అద్భుతమైన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించింది. మూడేళ్ల పాటు తాను ఎంతో శ్రమించి కఠోరంగా శిక్షణ పొందిన ఇన్‌లైన్ స్కేటింగ్‌లో ప్రపంచ స్థాయి అత్యున్నత ప్రదర్శన ఇచ్చి ప్రత్యర్థులు, క్రీడాభిమానుల ప్రశంసలు అందుకుంది.

అతి చిన్న వయసులోనే..

13 ఏళ్ల వయసులోనే దేశంలోనే నంబర్-1 స్కేటర్‌గా గుర్తింపు తెచ్చుకున్న జెస్సీని రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఇండియా స్కేట్) ఈ ప్రపంచ స్థాయి పోటీలకు పంపింది. ఈ నెల 13వ తేదీన న్యూజిల్యాండ్‌లోని టీఎస్‌బీ స్టేడియంలో ఈ పోటీలు ప్రారంభమయ్యాయి. పసిఫిక్ కప్ ఆర్టిస్టిక్ ఓపెన్ ఇన్విటేషనల్ కాంపిటీషన్ పేరుతో ఈ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో భారత్‌తో పాటు ఆస్ట్రేలియా, బ్రెజిల్, చైనా, ఐర్లాండ్, జపాన్, న్యూజిల్యాండ్ దేశాల క్రీడాకారులు పాల్గొన్నారు. నాలుగు రౌండ్లలో జరిగిన ఈ పోటీల్లో భారత క్రీడాకారిణి జెస్సీ అత్యధికంగా 31.98 పాయింట్లు సాధించి ప్రపంచ స్థాయిలో ప్రథమ స్థానం సాధించి, బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. ప్రపంచ క్రీడా వేదికపై భారత జాతీయ పతకాన్ని ఉన్నత స్థానంలో నిలిపిన జెస్సీని ఆంధ్రప్రదేశ్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ కార్యదర్శి థామస్ చౌదరి, కోచ్ సింహాద్రి అభినందించారు.

ఇది జెస్సీ నేపథ్యం..

విజయవాడలోని ఎస్ఎస్ఎం స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న జెస్సీ 2021 నుంచి స్కేటింగ్ శిక్షణ తీసుకుంటుంది. ఇప్పటి వరకు ఆమె ప్రాతినిధ్యం వహించిన జాతీయ పోటీల్లో ఒక గోల్డ్, ఒక సిల్వర్, మూడు బ్రాంజ్, రాష్ట్ర పోటీల్లో రెండు గోల్డ్, నాలుగు సిల్వర్, రెండు బ్రాంజ్, జిల్లా స్థాయి పోటీల్లో నాలుగు గోల్డ్, ఎనిమిది సిల్వర్ మెడల్స్ సాధించింది. వీటిలో పాటు స్కూల్ లెవల్ అథ్లెటిక్స్ పోటీల్లో 13, డాన్స్ పోటీల్లో ఒకటి, క్విజ్ పోటీల్లో రెండు, పేయింటింగ్ పోటీల్లో ఒక మెడల్‌ను సాధించి పిన్న వయసులోనే బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు తెచ్చుకుంది.

ఏక్ భారత్ - శ్రేష్ఠ భారత్ శిబిరం ప్రారంభం



ప్రసంగిస్తున్న కమాండెంట్ కల్నల్ ఎస్ఎం చంద్రశేఖర్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో ఆదివారం ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా క్యాంప్ కమాండెంట్ కల్నల్ ఎస్ఎం చంద్రశేఖర్ విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్‌లలోని గొప్ప సంప్రదాయాలు, ఆచారాలు ఆచరించదగినవి, కీర్తించదగినవి అని అన్నారు. ఎన్‌సీసీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనాలని, అదేవిధంగా సాంస్కృతిక మార్పిడిలో పాల్గొనాలని అన్నారు. ఈబీఎస్‌బీ చొరవ, సాంస్కృతిక, విద్య, సామాజిక అనుభవాల మార్పిడి ద్వారా వివిధ రాష్ట్రాల ప్రజల మధ్య పరస్పర అవగాహన బృందాన్ని ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. అనంతరం క్యాడెట్‌లందరికీ వివిధ పోటీలను నిర్వహించారు. కేఎల్‌యూ ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ పావని మాట్లాడుతూ ఎడ్యుకేషన్ ఫౌండేషన్‌లో ఈనెల 15వ తేదీ నుంచి 26 వరకు జరుగుతున్న ఈ కార్యక్రమానికి విశాఖపట్నం, కాకినాడ, కర్నూలు, తిరుపతి గ్రూపులు, రాజస్థాన్ డైరెక్టరేట్‌లోని జోద్‌పూర్, ఉదయ్‌పూర్ గ్రూపులకు చెందిన క్యాడెట్‌లతో పాటు ఏపీ, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్‌ల నుంచి మొత్తం 593 క్యాడెట్లు హాజరయ్యారని తెలిపారు. క్యాంప్ కమాండెంట్ కల్నల్ సీఎస్ సిద్ధు, డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ ఎస్‌వీఎస్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

టోఫెల్‌ను వెంటనే రద్దు చేయాలి



మాట్లాడుతున్న జోసఫ్ సుధీర్‌బాబు

నగరంపాలెం: టోఫెల్‌ను వెంటనే రద్దు చేయాలని ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి జోసఫ్ సుధీర్‌బాబు అన్నారు. కొత్తపేట మల్లయ్య లింగం భవన్‌లో ఆదివారం ఎస్‌టీయూ జిల్లా ప్రథమ కార్యవర్గ సమావేశం జరగ్గా, జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు అధ్యక్షత వహించారు. జోసఫ్ సుధీర్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఉన్నత పాఠశాలల్లో ఒక జూనియర్ అసిస్టెంట్‌ను కేటాయించాలన్నారు. తద్వారా ఉపాధ్యాయులకు బోధనేతర పనులు తగ్గించాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలు పీఆర్సీ, డీఏ అరియర్స్, ఈఎల్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో అమలుచేసిన జీఓ 117ను రద్దు చేయాలని అన్నారు. ఉపాధ్యాయుల బోధనకు అడ్డంకిగా మారిన యాప్‌లను రద్దు చేయాలన్నారు. 12వ పీఆర్సీ అమలు చేసేలోగా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి, ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు పెదబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ డిమాండ్లు సాధించుకునేందుకు సంఘాన్ని బలోపేతం చేయాలని అన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బారెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రామచంద్రయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాసిమళ్ల ప్రసాద్, జిల్లా ఆర్థిక కార్యదర్శి వీరాంజనేయులు, జిల్లా గౌరవాధ్యక్షుడు ఏవీ ప్రసాద్ బాబు, రాష్ట్ర కౌన్సిలర్లు బాజీ, జోసెఫ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొండ్రముట్ల ఆర్‌బీకేలో చోరీ



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఈపూరు: మండలంలోని కొండ్రముట్ల గ్రామంలోని ఆర్‌బీకేలో చోరీ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు అందించిన వివరాలు.. ఆర్‌బీకేలో విధులు నిర్వహిస్తున్న వీఏఏ శ్రీవిద్య శనివారం డ్యూటీ ముగించుకొని సెంటర్‌కు తాళాలు వేసింది. ఆదివారం ఉదయం ఆర్‌బీకే తాళాలు పగలగొట్టి తలుపులు తీసి ఉండటాన్ని గమనించిన వీఆర్‌ఏ, స్థానికులు వీఏఏకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న వీఏఏ వచ్చి చూడగా ఆర్‌బీకేలోని కంప్యూటర్, ప్రింటర్, కొన్ని ఎలక్ట్రానిక్ వస్తువులు అపహరణకు గురైనట్లు గుర్తించారు. ఫిర్యాదు మేరకు ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేశారు.

రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్న మంత్రి



పెనమలూరు: యనమలకుదురులో వేంచేసి ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామిని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదివారం దర్శించుకున్నారు. మంత్రి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో వేదమంత్రాలతో మంత్రికి తొలుత స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకుడు జీఆర్‌పీ సాగర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అభివృద్ధి దాత, ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు మంత్రి సుభాష్‌కు ఆలయ చిత్రపటం అందజేసి సత్కరించారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బి.గంగాధరరావు పాల్గొన్నారు.

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు



ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు



మృతి చెందిన సుబ్బారావు

పామర్రు: ఆర్టీసీ బస్సు అదుపు తప్పడంతో రోడ్డు పక్కన ఉన్న ఇద్దరిని ఢీకొట్టడం... వారిలో ఒకరు మృతి చెందడం.. మరొకరికి తీవ్రగాయాలైన ఘటన ఆదివారం పామర్రు– అవనిగడ్డ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పామర్రు గ్రామ పరిధి శ్యామలాపురానికి చెందిన గోవాడ సుబ్బారావు(58) తన పశువులను మేపేందుకు స్థానిక నాగపట్నం వద్దకు వెళ్లారు. స్థానికంగా ఉన్న అక్షయ సీఫుడ్ ఎదురుగా పామర్రు–అవనిగడ్డ రోడ్డు నిల్చున్నాడు. ఈ నేపథ్యంలో ద్విచక్ర వాహనంపై అక్కడికి చేరుకున్న శ్యామలాపురానికి చెందిన మంగం రాంబాబుతో సుబ్బారావు మాట్లాడుతూ ఉన్నారు. ఆ సమయంలో అవనిగడ్డ నుంచి గుడివాడ వైపు వస్తున్న ఏపీ16 టీఎఫ్ 4448 నంబర్ ఆర్టీసీ బస్సు నాగపట్నం వద్దకు రాగానే అదుపు తప్పింది. వేగంగా వచ్చిన బస్సు రోడ్డుకు ఎడమ పక్కన ఉన్న సుబ్బారావును, రాంబాబును బలంగా ఢీకొట్టింది. వారిని కొంత దూరం ఈడ్చుకెళ్లి అక్కడ ఉన్న చెట్టు వద్ద ఆగింది. గోవాడ సుబ్బారావుకు తీవ్రగాయాలై ఘటనా స్థలిలో మృతి చెందాడు. రాంబాబు రెండు కాళ్లు నలిగిపోయాయి. రాంబాబుని విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న శ్యామలాపురం వాసులు అందరూ సంఘటనా స్థలం చేరుకున్నారు.

రహదారిపై నిరసన

ఘటనకు కారణమైన ఆర్టీసీ డ్రైవర్‌ను కొట్టి బస్సు అద్దాలను పగలగొట్టారు. బస్సు డ్రైవర్ డ్రింక్ బాటిల్లో మందు కలుపుకుని సేవిస్తూ బస్సు నడపడంతో ప్రమాదం జరిగిందని, మృతుని కుటుంబానికి న్యాయం చేయాలంటూ రహదారిపై అడ్డంగా నిరసన తెలిపారు. దీంతో రోడ్డుపై ట్రాఫిక్ నిలిచి పోయింది. సమాచారం అందుకున్న పామర్రు పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలపడంతో స్థానికులు శాంతించారు. అనంతరం పామర్రు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో.. ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని గుడివాడ ప్రభుత్వ వైద్యశాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలించామని ఎస్ఐ తెలిపారు.

ఆంధ్రరాష్ట్ర ఆదిశైవ సంఘం జిల్లా కమిటీ ఏకగ్రీవం



ఎన్నికైన బాపట్ల జిల్లా కమిటీ సభ్యులు

చీరాల అర్బన్: ఆంధ్ర రాష్ట్ర ఆదిశైవ సంఘం బాపట్ల జిల్లా కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక పేరాలలోని పునుగు రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా స్వర్ణ సుబ్రహ్మణ్య బాపూజీ, ప్రధాన కార్యదర్శిగా మూలంరాజు రాజ్‌కుమార్, కోశాధికారిగా చందలూరి శ్రీనివాసరావు, జిల్లా కో-ఆర్డినేటర్‌గా ఎస్.మల్లికార్జున ప్రసాద్‌లను ఎన్నుకున్నారు. అలానే చీరాల శివాలయం అర్చకులు స్వర్ణ దివాకర్‌శర్మను రాష్ట్ర కమిటీకి తీసుకోవాలని సభ్యులు తీర్మానించారు. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర కోశాధికారి మురికిపూడి క్రిష్ణకిషోర్, పేటేటి వాసుదేవరావు వ్యవహరించారు. ఎన్నికల నిర్వహణను కారంచేటి శివరామకృష్ణ, కారంచేటి నగేష్ కుమార్ పర్యవేక్షించారు.

వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఐదుగురు అరెస్టు

బంగారం, వెండి, వజ్రాలు, రూ. 4.20 లక్షల నగదు స్వాధీనం

అద్దంకి రూరల్: తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఐదుగురు నిందితులను పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. సీఐ కృష్ణయ్య వివరాల మేరకు.. అద్దంకి పట్టణం, పరిసర గ్రామాల్లో గత కొన్నిరోజులుగా నిందితులు వరుస దొంగతనాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. నిందితులైన తాళ్లూరు మండలం రామభద్రాపురం గ్రామానికి చెందిన వడిసిన వేణుగోపాల్‌రెడ్డి, చీమకుర్తికి చెందిన షేక్ తరుణ్ అలియాస్ రఫీ, నూతలపాటి రాధాకృష్ణ, చింతలపూడి శివప్రసాద్, చింతలపూడి నరసింహారావులను అద్దంకిలోని భవాని సెంటర్‌లో వాహనాల తనిఖీలో భాగంగా పట్టుకున్నారు. అనంతరం వారి నుంచి బంగారం, వెండి, వజ్రాలతోపాటు రూ.4.20 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిలో వేణుగోపాల్‌రెడ్డిపై రాష్ట్రంలోని పలు జిల్లాల్లో నేరాలకు పాల్పడినట్లు కేసులు ఉన్నాయి. ఇంకా వారి నుంచి గంజాయి, మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

ఆకట్టుకున్న చార్వి కూచిపూడి నృత్యం



నృత్య ప్రదర్శన చేస్తున్న చార్విరాజు

విజయవాడ కల్చరల్: నాట్యాచార్యుడు, సిద్ధేంద్రయోగి కళాపీఠం వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చింతారవి బాలకృష్ణ ఆధ్వర్యాన దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాలలో ఆదివారం చింతాడ చార్విరాజు కూచిపూడి రంగ ప్రవేశంలో భాగంగా ఆమె ప్రదర్శించిన అంశాలు మనోహరంగా సాగాయి. నటరాగంలో నర్తన గణపతిం, ఖండచాపురాగంలో చిదంబ స్తవం, మోహనరాగంలో ఇతనికంటే మరి, హిందోళ రాగంలో క్షేత్రయ్యపదం, ధనశ్రీ రాగంలో థిల్లానా అంశాలను ప్రదర్శించింది. నట్టువాగం అంశాన్ని డాక్టర్ చింతా రవి బాలకృష్ణ, గాత్రం పస్తుమర్తి పావని, వయోలిన్ అంశాలను పాలపర్తి ఆంజనేయులు, ఫ్లూట్ అంశాన్ని ఎస్ వనమాలి నిర్వహించారు. ముఖ్య అతిథి నాట్యాచార్యుడు డాక్టర్ భాగవతుల వెంకట్రామశర్మ మాట్లాడుతూ నాట్యాన్ని భగవత్ సేవగా భావించాల్సిన అవసరముందన్నారు. కళాకారులకు చిత్తశుద్ధి ఏకాగ్రత, అంకిత భావం, భావ లాలిత్యం కావాలని సూచించారు. డాక్టర్ వేదాంతం రాధేశ్యాం.. నాట్యాచార్యులు డాక్టర్ చింతారవి బాలకృష్ణ నిరంతర అధ్యయన శీలిగా అభివర్ధించారు. కూచిపూడి నాట్య సంప్రదాయాన్ని కాపాడుతున్న నాట్యాచార్యుల సేవలను ప్రభుత్వం గుర్తించాలని సూచించారు. యక్షగాన ప్రముఖలు డాక్టర్ పస్తుమర్తి శేషుబాబు కూచిపూడి రంగ ప్రవేశం చేసిన చార్విని అభినందించారు. నిర్వాహకులు నాట్యాచార్యుడు డాక్టర్ చింతారవి బాలకృష్ణను ఘనంగా సత్కరించారు.

యాచకుడు, దాత యడ్ల యాదిరెడ్డి మృతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): యాచకుడే దాతగా మారి దాతృత్వానికే కొత్త నిర్వచనం తీసుకువచ్చిన యాచకుడు యడ్ల యాదిరెడ్డి (85) స్వామి ఆదివారం సాయంత్రం మృతి చెందారు. ముత్యాలంపాడు శ్రీషిర్డీసాయిబాబా మందిరం వద్ద యాచక వృత్తి చేస్తున్న ఆయన తాను సేకరించిన ప్రతి పైసాను దైవకార్యాలకు వినియోగించారు. ఆయన షిర్డీసాయిబాబా మందిరంతో పాటు, శ్రీ కోదండ రామాలయం, శ్రీ ఈశ్వరమ్మ దేవాలయం, శ్రీ కనకదుర్గ దేవాలయాలకు సుమారు రూ. 15 లక్షలు విరాళాలను అందజేసి అపర కర్ణుడిగా పలువురి ప్రశంసలు అందుకున్నారు. షిర్డీసాయిబాబా మందిరంలో గోశాల నిర్మాణానికి కూడా విరాళం అందజేశారు. ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కొన్ని రోజులుగా ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన ఆయన అంబేడ్కర్ కాలనీలోని తన నివాసంలో ఆదివారం సాయంత్రం మృతి చెందారు. తన దాతృత్వంతో అందరికీ ఆదర్శంగా నిలిచిన యడ్ల ఆదిరెడ్డి స్వామి అంతిమ యాత్రను సోమవారం ఉదయం 10 గంటలకు సత్యనారాయణపురం అంతిమయాత్ర భవన్ నుంచి నిర్వహించనున్నట్లు షిర్డీసాయిబాబా మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి తెలిపారు.

సముద్ర స్నానం చేస్తూ విద్యార్థి గల్లంతు

చీరాల: విహార యాత్ర విషాదాన్ని నింపింది. చీరాల రూరల్ మండలం వాడరేవు సముద్ర తీరంలో బీటెక్ విద్యార్థి గల్లంతయ్యాడు. నూజివీడులోని లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న 11 మంది విద్యార్థులు ఆదివారం వాడరేవు సముద్ర తీరానికి వచ్చారు. వీరు సముద్ర స్నానం చేస్తుండగా కోనూరి కార్తిక్ (19), మైలవరపు కేదారేశ్వరరావు అలల ధాటికి గల్లంతయ్యారు. స్నేహితులు ఇద్దరు సముద్రంలో చిక్కుకోవడంతో మిగిలిన వారు కేకలు వేశారు. దీంతో మెరైన్ పోలీసులు అక్కడికి చేరుకుని కేదారేశ్వరరావును కాపాడి ఒడ్డుకు తీసుకువచ్చారు. కార్తిక్ మాత్రం గల్లంతయ్యాడు. ఈ మేరకు రూరల్ పోలీసులు విద్యార్థుల వద్ద నుంచి వివరాలు నమోదు చేసుకున్నారు.

యువతి జన్మదిన వేడుకల్లో ఘర్షణ

యువకుడికి తీవ్ర గాయాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): యువతి జన్మదిన వేడుకల సందర్భంగా జరిగిన ఘర్షణలో యువకుడు తీవ్రంగా గాయపడిన ఘటన పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితుడి ఫిర్యాదు ప్రకారం సనత్ నగర్‌కు చెందిన ఇర్ఫాన్ అనే యువకుడు పటమట శివ శంకర్ రోడ్డులో నివసిస్తున్న తన స్నేహితురాలికి జన్మదిన శుభాకాంక్షలు తెలపడానికి శనివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో అక్కడికి వెళ్లాడు. అదే సమయంలో అక్కడ ఉన్న జయప్రకాశ్‌వర్మ అలియాస్ జేపీ ఆకాష్, దానీ, సతీష్, సంజీవ్ కలిసి ఇర్ఫాన్‌తో ఘర్షణ పడ్డారు. అనంతరం ఇర్ఫాన్ తన ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. రూప ఆర్థోపెడిక్ హాస్పటల్ సమీపానికి వచ్చేసరికి జయప్రకాష్‌తోపాటు మరో ముగ్గురు యువకులు ద్విచక్రవాహనాలపై వచ్చారు. ఇర్ఫాన్‌ను అడ్డుకుని కర్రలతో విచక్షణారహితంగా దాడి చేశారు. దీంతో ఇర్ఫాన్ తలకు తీవ్ర గాయం కావడం.. అతను పెద్దగా కేకలు వేయడంతో హాస్పటల్ సిబ్బంది అక్కడికి వచ్చారు. ఇర్ఫాన్‌పై దాడి చేసిన యువకులు పరారయ్యారు. ప్రస్తుతం ఇర్ఫాన్ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేస్తున్నారు. ఇర్ఫాన్‌పై దాడి చేసిన వారిలో జయప్రకాష్ వర్మ అలియాస్ జేపీ పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. బెంగుళూరులో హత్యాయత్నం కేసులో నిందితుడిగా ఉన్నట్లు సమాచారం. దీంతోపాటు పటమట పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసులో ప్రధాన నిందితుడు. పోక్సో కేసు నమోదు చేసి రెండేళ్లవుతున్నా ఇంత వరకు జేపీని అరెస్ట్ చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అతని కుటుంబసభ్యులు పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తుండటంతో జేపీపట్ల పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే యువతి వ్యవహారంలో గ్రూపులుగా ఏర్పడి గతంలోకూడా అనేక సార్లు ఘర్షణలు జరిగినట్లు తెలుస్తోంది.